# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభల ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈ మధ్యాహ్నం ప్రకటించనుంది.**
2. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో పర్యటిస్తారు.**
3. **రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కమార్ మీనా తెలిపారు.**
4. **రాష్ట్ర శాసనసభ, లోక్‌సభకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొద్దిసేపటి క్రితం ప్రకటించారు.**
5. **రాష్ట్రంలో ఈనెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఈరోజు వెలువడనుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో షెడ్యూల్‌ను ప్రకటించనుంది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. అలాగే తెలంగాణలో ఖాళీగా ఉన్న ఒక అసెంబ్లీ స్థానానికి(కంటోన్మెంట్) ఉప ఎన్నికలషెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. షెడ్యూల్ వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రానుంది. ప్రస్తుత లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కాలపరిమితి జూన్ 16వ తేదీతో ముగియనుంది. అలాగే.. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీల గడువు జూన్ 2వ తేదీతో, ఒడిశా అసెంబ్లీ గడువు జూన్ 24వ తేదీతో ముగియనున్నాయి.

--------------------------

భారత్‌లోని 140 కోట్ల మంది ప్రజలే తనకు స్ఫూర్తినిస్తూ ముందుకు నడుపుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో 'మై డియర్ ఫ్యామిలీ మెంబర్' అని సంబోధిస్తూ దేశ ప్రజలకు ప్రధానమంత్రి ఈరోజు బహిరంగ లేఖ రాశారు. వికసిత్ భారత్ కలను నిజం చేయడానికి మీ సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. రైతులు, పేదలు, యువకులు, మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు ఈ పదేళ్లలో అనేక పథకాలు అమలు చేశామని తెలిపారు. ప్రజల సహకారంతో ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ లాంటి ఎన్నో విజయాలు సాధించామని లేఖలో పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్, నారీ శక్తి వందన్ చట్టాలతో మహిళలకు సాధికారత కల్పించామని వివరించారు. పీఎం ఆవాస్ యోజన, ఇంటింటికీ

కుళాయి కనెక్షన్, కరెంటు, గ్యాస్, ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నామని, భారీగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మించామని వివరించారు. వికసిత్ భారత్‌కు సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతో దేశాన్ని మరింత తీసుకువెళ్తామన్న నమ్మకం తనకు ఉందని లేఖలో మోదీ పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రానున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఎన్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ ధావడే నిన్న ఎన్డీఏ భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని, వేదికను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, హాజరౌతున్న ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు తదితర వివరాలను పార్టీ వర్గాలను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కమార్ మీనా తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న పాత్రికేయులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ప్రసార మాధ్యమాల్లో ప్రచురితం ప్రసారం అయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై ప్రచార మాధ్యమాల ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రసార మాధ్యమాలు అనుసరించాల్సిన విధి విధానాలపై భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల కనుగుణంగా మీడియా యూనిట్లు ప్రవర్తించాలని అన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటినుండి పెయిడ్ న్యూస్ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తామని తెలిపారు. ఇందుకై జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉండే మీడియా సర్టిఫికేషన్ మీడియా మానిటరింగ్ కమిటీలు అప్రమత్తంగా పర్యవేక్షిస్తాయని తెలిపారు. నిర్దేశించిన రేట్‌కార్డ్ ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గణించి ఆ వ్యయాన్ని సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు నెట్వర్క్ సౌకర్యాన్ని క ల్పించాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను రాష్ట్ర అద నపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంధిర ప్ర సాద్ ఆదేశించారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో టె లీకం సర్వీస్ ప్రొవైడర్లతో ఆయన సమావేశమై పోలింగ్ కేంద్రాలకు నెట్వర్క్ సౌకర్యాన్ని పెంచే అం శంపై సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల 165 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, సుమారు 50 శాతం పోలింగ్ కేంద్రాలలో జరిగే పోలింగ్ ప్రక్రి యను వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ నిధులను వినియోగిస్తూ సమస్యాత్మక ఏరియాలోని 689 పోలిం గ్ కేంద్రాలకు టవర్ల సౌకర్యాన్ని కల్పించే పను లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు బల్క్ ఎస్ఎంఎస్ ద్వారా చేయనున్న ప్రచారానికి ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతిని తప్పనిసరిగా పొందాల్సి ఉందని చెప్పారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్‌కు ముందు రోజు, కౌం టింగ్ నిర్వహించే రోజు నిరంతరాయంగా నెట్వర్క్ సేవలు అందించాలని స్పష్టం చేశారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే 175 మంది అభ్యర్థుల పేర్లను

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొద్దిసేపటి క్రితం ప్రకటించారు. అలాగే లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలోని 25 స్థానాల అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. కడప జిల్లా ఇడుపులపాయకు ఈ ఉదయం చేరుకున్న ఆయన వైఎస్సార్ ఘాట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళి అర్పించారు. అనంతరం అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు.

---------------------------

ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి కైలాస్ చౌదరి తెలిపారు. తిరుపతిలో భారతీయ జనతాపార్టీ నేతలతో ఈరోజు ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందన్నారు. ప్రపంచంలోని మరే దేశంలోనూ లేని విధంగా నిరుపేదలకు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్రమంతి చెబుతూ..

..వాయిస్...

---------------------------

రాష్ట్రంలో ఈనెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల 45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలలు నిర్వహించాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలలోని రెండో శనివారం పాఠశాలలు పని చేయాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆరుబయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని సూచించారు. పదో తరగతి పరీక్షల కేంద్రాలైన పాఠశాలలకు 18 నుంచి 23వ తేదీ వరకు సెలవులు ఉంటాయని... ఈ ఆరు రోజులకు బదులుగా ఈనెల 24, 31, ఏప్రిల్ 7, 13, 14, 21 తేదీల్లో తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వెలకట్టలేనిదని పలువురు ప్రముఖులు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈరోజు తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ తో పాటూ వివిధ శాఖల అధికారులు.. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపట్ల, తిరుపతి, చిత్తూరు, పల్నాడు, విజయనగరం, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు కలక్టరేట్ల ప్రాంగణంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

---------------------------

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు వైయస్సార్ చేయూత పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక శాఖల మంత్రి ఆర్కే రోజా తెలిపారు. చిత్తూరు జిల్లా నగరిలో ఈరోజు డ్వాక్రా మహిళలకు వైయస్సార్ చేయూత చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు రుణాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందించిన రుణాలతో చిరు

వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని మహిళలు తమ కుటుంబాన్ని స్వశక్తితో పోషించుకుంటున్నారని తెలిపారు.

---------------------------

ఈరోజు 'జాతీయ టీకా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 1995లో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని దేశ స్థాయిలో విజయవంతంగా నిర్వహించడంతో, 2014 నాటికి దేశాన్ని పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దుకోగలిగాం.. అలాగే ప్రపంచం మొత్తాన్ని గడగడలాడించిన కరోనా నియంత్రణకు అతికొద్ది కాలంలోనే శరవేగంతో కరోనా టీకాను తయారుచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

======================